
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి మెదక్ 5 జిల్లాల వార్తలు

గురువారం 20 మార్చి 2025

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:33 (గురువారం సాయంత్రం)
సహర్: 4:58 (శుక్రవారం ఉదయం)

ప్లానింగ్‌తో పరీక్ష రాద్దాం

● టెన్త్ విద్యార్థుల కోసం నిపుణుల సలహాలు

7

మల్లన్నసాగర్ కాలువలో చనిపోయిన కోళ్లు డంపింగ్

7

బీసీ, ఎస్సీల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది

సంగారెడ్డిలో సంబరాల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, శ్రీదర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నిర్మలా జగ్గారెడ్డి తదితరులు

సంగారెడ్డి టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సారథ్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు, ఎస్సీ వర్గీకరణకు బిల్లుకు శాసన సభ ఆమోదం తెలుపడంపై సంగారెడ్డి పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రిజర్వేషన్ కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, శ్రీదర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించడం ద్వారా దశాబ్దాల కల నెరవేరిందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకొనే పార్టీ కాంగ్రెస్ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా చెయ్యని పని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ తోపాజీ అనంతకిషన్, పట్టణ అధ్యక్షుడు జార్జ్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్, షఫీ, బబ్బు, వెంకట్‌రాజు, కసినిరాజు, చిత్తారి యాదగిరి, నర్సింహులు, ప్రదీప్, నవాజ్, బండి నర్సింహులు, సతీష్‌రెడ్డి, శ్రీశైలం, బాలు యాదవ్, వెంకట్, ఆరీఫ్, తాహేర్ పాషా, కుతుబ్, జహీర్, కసిని విక్రాంత్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.



పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఒక్కమడి పొలానికి రెండు ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్న రైతు

పంట కోసం పాట్లు

● ఒక మడినైనా కాపాడుకుందామని..

● ట్యాంకర్ల కొద్ది నీరు కొనుగోలు

చేర్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : భూగర్భ జలాలు అడుగంటడంతో చేర్యాల ప్రాంతంలోని రైతాంగం పరిస్థితి దయనీయంగా మారింది. ఎండిన పంట కోతకయ్యే ఖర్చులనూ భరించలేని స్థితిలో పశువుల మేతకు వదిలిపెడుతున్న దుస్థితి. నెలకొన్నది. ఇప్పటికే ఎకరాలకొద్ది పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు.. కనీసం తినడానికి ఒక మడినైనా కాపాడుకుందామని ట్యాంకర్ల కొద్ది నీటిని కొనుగోలు చేస్తూ పడరాని పాట్లు పడుతున్నారు. చేర్యాల మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి కత్తుల వెంకట్‌రెడ్డి నాలుగు ఎకరాల్లో వరి సాగుచేశాడు. రెండు బోర్లు ఉండగా, ఒక్కబోరు మాత్రమే సన్నటిధార పోస్తుంది. ఇటీవల వేసిన మూడుబోర్లలోనూ చుక్క నీరు రాలేదు. దీంతో ఆశ వదులుకొని ఎండిపోయిన మూడున్నర ఎకరాలను పశువులను మేపుకుంటున్నాడు. కనీసం తిన డానికైనా ఒక్క మడినైనా కాపాడుకుందామని నిత్యం రెండు ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేస్తూ మడి ఎండిపోకుండా ప్రయత్నిస్తున్నాడు.



సంగారెడ్డి బాలికల ఉన్నత పాఠశాల నుంచి హాస్టల్‌కు వెళుతున్న క్రమంలో ఎండ నుంచి రక్షణ కోసం చున్నీలను తలపై కప్పుకున్న విద్యార్థినులు : స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి జిల్లా

బాబోయ్.. ఎండలు

భానుడి ప్రతాపానికి జనం విలవిల

దిగ్వాల్‌లో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

కోహీర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు భానుడి ప్రతాపానికి ప్రజలు విలవిలలాడుతున్నారు. ఎండ తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ తీవ్రతకు అధికమవడంతో రైతులు, కూలీలు పొలాలకు వెళ్లడానికి భయపడుతున్నారు. పది రోజులుగా ఎండలు పెరగడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఉదయం 9 గంటలకు మొదలైన ఎండ సాయంత్రం 6 గంటలయినా తగ్గడం లేదు. రెండు రోజుల్లో రాష్ట్రంలో వడగళ్ల వర్షాలు కురుస్తాయని భారత వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎండల నుంచి ఉపశమనం లభించవచ్చని ప్రజలు భావిస్తున్నారు.

బుధవారం నమోదైన ఉష్ణోగ్రతలు

సంగారెడ్డి జిల్లా దిగ్వాల్‌లో 40.1 డిగ్రీలు, చౌటకూర్ 39.1 సత్వార్ 39.9, నారాయణఖేడ్ 39.8, పల్వట్ల 39.8, సదాశివపేట 39.7, వట్‌పల్లి 39.7, ముక్తాపూర్ 39.7, గుండ్లమాచునూరు 39.6, సుల్తాన్‌పూర్ 39.6, అల్గోల్ 39.5, మొగుడంపల్లి 39.5, హత్నూర 39.5, అల్మాయిపేట్ 39.5, జిన్నారం 39.4, పాశమైలారం 39.4, జహీరాబాద్ 39.4, గుమ్మడిదల 39.3 బీహెచ్‌ఈఎల్ 39.3, మల్‌చెల్మ 39.3, పుల్కల్ 39.2, కడ్పల్ 9.2, కంది 39.2, లక్ష్మీసాగర్ 39.1, రుద్రారం 39.0 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లాలో

కాగజ్‌మద్దూర్‌లో 39.9 డిగ్రీలు, దామరంచ 39.8, నాగపూర్ 39.8, పాతూర్ 39.7 నర్సాపూర్ 39.7, రాజ్‌పల్లి 39.5, కొడిపల్లి 39.5, రేగోడ్ 39.4, చిప్పల్‌తుర్తి 39.4, కొత్తపేట 39.4, శివ్వంపేట 39.4, బోడఘాట్ 39.3, అల్లాదుర్గం 39.3, శంకరంపేట(ఆర్) 39.3, పోచంపల్లి 39.2, లక్ష్మాపూర్‌లో 39.0 ఉష్ణోగ్రత నమోదైంది.

సిద్దిపేట జిల్లాలో

తుక్కాపూర్ 39.8, చికోడ్ 39.8, దౌల్తాబాద్ 39.7, హుస్నాబాద్ 39.5, బెజ్జంకి 39.4, సిద్దిపేట 39.3, రేబర్తి 39.2, గౌరారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



నిర్మానుష్యంగా మారిన కోహీర్ గ్రామం

ఈసారీ నిరాశే..

● రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు దక్కని కొత్త ప్రాజెక్టులు ● ప్రస్తావనకు రాని మెతుకుసీమ సమస్యలు



సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసిన భట్టి విక్రమార్క

నీటిపారుదల శాఖకు 23,373 కోట్ల కేటాయింపుతో ఆశలు

సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులు, కొత్త కాలువలకు నిధులొచ్చేనా?

వ్యవసాయం, వైద్యారోగ్యశాఖకు ప్రాధాన్యత.. మున్సిపాలిటీల అభివృద్ధిపై దృష్టి

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ బడ్జెట్ నివేదికలో ఎక్కడా ఉమ్మడి మెదక్ జిల్లా పేరు ప్రస్తావనకు రాకపోవడం గమనార్హం. కొత్త ప్రాజెక్టుల మంజూరు సంగతి పక్కనబెడితే బడ్జెట్‌లో సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లుగా కనిపిస్తోంది. సంక్షేమంతోపాటు వైద్యారోగ్య, రోడ్లు, భవనాలు, వ్యవసాయం, సాగునీటి, పురపాలక రంగాలకు అత్యధిక నిధులు కేటాయించిన నేపథ్యంలో మెతుకుసీమకు కూడా ప్రయోజనం కలుగుతుందనే ఆశలు నెలకొన్నాయి. అయితే సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు ఏ స్థాయిలో కేటాయింపులు ఉంటాయో వేచి చూడాల్సిందే.

బడ్జెట్‌పై భినాభిప్రాయాలు 7

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 19: సంగారెడ్డి జిల్లాలో సంగమేశ్వర, బసవేశ్వర సాగునీటి ప్రాజెక్టుల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. అదే విధంగా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి రిజర్వాయర్లకు అనుసంధానంగా కాలువల నిర్మాణం, భూనిర్వాసితుల పరిహారం గురించి కూడా పేర్కొనలేదు. జహీరాబాద్ ప్రాంతంలో ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణ విషయాన్ని మరచినట్లున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్న దాదాపు 3వేల డబుల్ బెడ్రూం ఇళ్ల విషయం ప్రస్తావనకు రాలేదు. అదే విధంగా సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, దుబ్బాక, మెదక్ జిల్లాలోని రామాయంపేట, సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు కేంద్రాలను రెవెన్యూ డివిజన్లుగా మార్చాలనే ప్రతిపాదనలకు చోటు దక్కలేదు. ప్రధానంగా మెతుకుసీమ దశ, దిశను మార్చేవిధంగా కొత్త ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాల గురించి పేర్కొనకపోవడం నిరాశను కలిగిస్తోంది.

వైద్యారోగ్యం, వ్యవసాయం, పురపాలనకు నిధులు

వైద్యారోగ్య శాఖకు రూ.12,393 కోట్లు కేటాయించడం కొంత ఊరట కలిగించే విషయమే. మెదక్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలకు సొంత భవనంతో పాటు అనుబంధ ఆసుపత్రిని ఏర్పాటు చేయాల్సి ఉంది. సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఆసుపత్రికి సైతం నిధులు అవసరం ఉన్నాయి. అదేవిధంగా సిద్దిపేటలో వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 90శాతం మేర నిర్మించినప్పటికీ తుదిదశ పనులు చేపట్టకపోవడంతో ప్రారంభించలేదు. కూడా నిధులు కేటాయిస్తే ఇక్కడ నిరుపేదలకు ఆసుపత్రి అందుబాటులోకి వస్తుంది.

వ్యవసాయశాఖకు అత్యధికంగా రూ.24,439 కోట్లు కేటాయించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో రుణమాఫీ జరగని రైతులకు తీపి కబురు అందనున్నది. వానాకాలం రైతుభరోసా, సన్నవడ్లకు బోనస్ రూపంలోనూ ఈ నిధులు రైతుల ఖాతాల్లో చేరనున్నాయి. అంతేగాకుండా కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఉమ్మడి జిల్లాలో కోహీర్, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్ మున్సిపాలిటీలను ఇటీవల ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పట్టణాలకు రూ.4500 కోట్లు కేటాయించారు. ఇక ఇతర మున్సిపాలిటీలకు రూ.17,677 కోట్లు కేటాయించగా ఉమ్మడి జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల, రామాయంపేట, మెదక్, తూప్రాన్, మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్-జోగిపేట, అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీలకూ ప్రయోజనం చేకూరనున్నది.

రూ.23వేల కోట్లలో మనకెంత?

ఉమ్మడి మెదక్ జిల్లాను ప్రధానంగా వేధిస్తున్న సమస్య సరిపడా సాగునీరు లేకపోవడమే. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్లను నిర్మించారు. కానీ వీటికి అనుసంధానంగా కాలువలను నిర్మించలేదు. ఈ కాలువల నిర్మాణం పూర్తయితే సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాలు సస్యశ్యామలమవుతాయి. మెదక్, నర్సాపూర్‌లకు ప్రయోజనం చేకూరుతుంది. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను నిర్మిస్తే జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి, అందోల్ నియోజకవర్గాల దశ మారుతుంది. అయితే రాష్ట్ర బడ్జెట్‌లో రూ.23,373 కోట్ల రూపాయలను నీటిపారుదల శాఖకు కేటాయించారు. ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లాకు తగినంత నిధులు కేటాయిస్తేనే సాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

సంక్షేమ రంగాలకు పుష్కలంగా నిధులు

రాష్ట్ర బడ్జెట్‌లో ప్రధానంగా బీసీ,ఎస్సీ,ఎస్టీ వర్గాలకు పెద్దపీట వేశారు. దీంతో మెతుకుసీమలోని దాదాపు 80 శాతం ప్రజలకు అనేక రకాల ప్రయోజనాలు దక్కనున్నాయి. స్వయం ఉపాధి కోసం రుణాలతోపాటు సామాజిక వర్గాల పరంగా ఏర్పాటు చేసిన గురుకులాలకూ ఈ నిధులు చెందుతాయి. ఎస్సీలకు రూ.40,232 కోట్లు, ఎస్టీలకు రూ.17,169 కోట్లు, బీసీలకు రూ.11,405 కోట్లు కేటాయించడంతో ఆ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున నిధులు కేటాయించారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్యారానగర్‌లో డంపుయార్డ్.. నిబంధనలకు విరుద్ధం

● తప్పుడు డాక్యుమెంట్లతో అనుమతులు

● కేంద్ర మంత్రికి ఎంపీ, జేఏసీ వినతి

గుమ్మడిదల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్ శివారులో నిర్మిస్తున్న డంప్‌యార్డు పనులను వెంటనే నిలిపివేయాలని ఎంపీ రఘునందన్‌రావు ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌ను కలిసి విన్నవించారు. మంత్రి స్వస్థలమైన హరియాణా రాష్ట్రం, జమాల్‌పూర్ గ్రామంలో బుధవారం ఆయనను కలిసి ప్యారానగర్ డంప్‌యార్డు గురించి వివరించారు. గత ప్రభుత్వం హయాంలో తప్పుడు డాక్యుమెంట్లతో డంపుయార్డుకు అనుమతులు తీసుకున్నారని ఆరోపించారు. ప్రజలు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకుండా పోలీసుల సహకారంతో పనులు కొనసాగిస్తున్నారని తెలియజేశారు. అటవీ ప్రాంతంలో డంపుయార్డు నిర్మాణంతో పర్యావరణానికి తీరని నష్టం జరుగుతుందని విన్నవించారు. దీనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్రమంత్రిని కలిసినవారిలో మురళీధర్ యాదవ్, గోవర్ధన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, సదానందరెడ్డి తదితరులు ఉన్నారు.



కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఉపేంద్రయాదవ్‌ను కలిసిన ఎంపీ రఘునందన్, జేఏసీ నాయకులు

పన్ను వసూళ్లలో చేతివాటం!

● కొందరికి రూ.వందల్లో.. మరొకొందరికి రూ.వేలల్లో..

● రికార్డుల్లోకి ఎక్కని వంద ఇళ్లు.. సిబ్బంది జేబుల్లోకి పన్ను

● ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

● తూతూమంత్రంగా తనిఖీలు



కంది, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న కంది గ్రామంలో ఇంటి పన్ను వసూళ్లలో పంచాయతీ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇంటి పన్ను రేటు పెంచకుండా కొందరికి.. ఇళ్లను రికార్డుల్లోకే ఎక్కించకుండా మరికొందరి సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో 3 వేలకు పైగా ఇళ్లున్నాయి. ఏటా రూ. కోటి వరకు పన్ను వసూలు కావాల్సి ఉంది. కానీ, ప్రస్తుతం రూ. 43 లక్షలు మాత్రమే వసూలవుతున్నది. సామాన్యుల ఇళ్లకు పన్ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుండగా.. కొందరు నాయకులకు మాత్రం దశాబ్దాలుగా వందల్లోనే పన్నులు విధిస్తున్నట్లు విమర్శలున్నాయి. గ్రామంలో 100 వరకు ఇళ్లు అసలు రికార్డుల్లోనే నమోదు చేయలేదని తెలుస్తున్నది. 400 నుంచి 600 గజాల్లో ఉన్న ఇళ్లకు.. రెండుమూడు అంతస్థుల ఇళ్లకు కూడా రూ.100 నుంచి రూ.500 మాత్రమే పన్ను విధించడం ఏమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ రికార్డులను తనిఖీ చేయాల్సిన ఆడిట్ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఈ విషయంపై కంది పంచాయతీ కార్యదర్శి విద్యాధరగౌడ్‌ను వివరణ కోరగా పంచాయతీ వెబ్‌సైట్‌లో ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతోనే పన్ను పెంచలేకపోతున్నట్లు పేర్కొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పారదర్శక రెవెన్యూ పాలనే లక్ష్యం

ధరణి, ప్రజావాణి పెండింగ్ అర్జీలపై దృష్టి : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పారదర్శక రెవెన్యూ పాలన అందించడం కోసం తహసీల్దార్లు జవాబుదారీతనంతో పనిచేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. మెదక్‌లోని కలెక్టరేట్‌లో బుధవారం ధరణి స్పెషల్‌డ్రైవ్, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, ప్రభుత్వ భూములు, రికార్డ్ మేనేజ్‌మెంట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని, సమస్యల పరిష్కారానికి ప్రణాళిక బద్ధమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమయపాలన తప్పని సరిగా పాటించాలని సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని, ప్రతీ సమస్యకు పరిష్కారం దొరుకుతుందనే భావన వారిలో కలిగేలా చూడాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయాలను తాను ఆకస్మికంగా తనిఖీలు చేస్తానని చెప్పారు. జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో నో హెల్మెంట్.. నో ఎంట్రీ అమలు చేయాలని, ప్లాస్టిక్ రహిత కార్యాలయాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువవికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువవికాస పథకం ద్వారా అన్ని కులాలవారికి స్వయంఉపాధి కల్పించేందుకు రూ.4లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేస్తోందని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి రేషన్‌కార్డుకు ఒక్కరే అర్హులని, గరిష్ఠంగా రూ.4లక్షల వరకు రుణం పొందవచ్చని తెలిపారు. రుణంలో లబ్ధిదారులకు 60 నుంచి 80 శాతం రాయితీ కల్పిస్తుందని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా జతచేయాలని తెలిపారు. ఈ పథకం కింద రుణం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 5 వరకు గడువు ఉందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

'పది' పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రత

మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రేపటి నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 4 వరకు జరిగే పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 68 కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. అన్ని కేంద్రాల వద్ద అన్ని కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. విద్యార్థులు గంట ముందుగానే చేరుకోవాలని, ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు.

నిషేధిత అల్ప్రాజోలం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

హత్నూర, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు ఓ ఇంటిపై దాడిచేసి నిషేధిత అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్న సంఘటన హత్నూర మండలం దౌల్తాబాద్ బస్టాండ్ సమీపంలోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. దౌల్తాబాద్ బస్టాండ్ సమీపంలోని కాసాల గ్రామ శివారులో ఓ ఇంటిపై మంగళవారం రాత్రి ప్రొఫెషనల్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ అసిస్టెంట్ కమిషనర్ (మెదక్ డివిజన్) ఏఈఎస్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడి చేసినట్లు అధికారులు తెలిపారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన రాజాగౌడ్, సిద్దిపేట ప్రాంతానికి చెందిన చిత్తాపూర్ గ్రామానికి చెందిన నర్సాగౌడ్ ఇద్దరూ నిషేధిత అల్ప్రాజోలం 503 గ్రాములు, డయజోఫామ్ 17 గ్రాములు ఇంట్లో ప్లాస్టిక్ కవర్లలో నింపుతున్న క్రమంలో నమ్మదగిన సమాచారం మేరకు దాడిచేసి పట్టుకున్నామన్నారు. వీటి విలువ సుమారు రూ.5.20 లక్షలు ఉంటుందన్నారు. వీటితో పాటు రెండు ఫోన్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అదుపులోకి తీసుకుని అందోల్ ఎక్సైజ్ సీఐకి అప్పగించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఏఈఎస్ శ్రీనివాసరావు, ఇతర ఎక్సైజ్ అధికారులు వీణారెడ్డి, చంద్రశేఖర్, గాంధీనాయక్, అనిల్‌కుమార్, యాదయ్య, ఖరీం, సతీష్, మోహన్, ప్రహల్లాద్‌రెడ్డి, వివేక్ పాల్గొన్నారు.

బొలెరో, లారీ ఢీ.. ఒకరు మృతి

నారాయణఖేడ్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న బొలెరో, లారీ ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్-నిజాంపేట 161బీ జాతీయ రహదారిపై ర్యాలమడుగు సమీపంలో బుధవారం చోటు చేసుకున్నది. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన బొలెరో వాహనం మందులను సరఫరా చేసి తిరిగి వెళ్తున్నది. ఈ క్రమంలో ర్యాలమడుగు సమీపంలో నిజాంపేట నుంచి వస్తున్న లారీ ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బొలెరో డ్రైవర్ వాజీద్(35) అక్కడికక్కడే మృతిచెందాడు. బొలెరో వాహనం ముందు భాగం నుజ్జునుజ్జు కావడానికి తోడు డ్రైవర్ అందులోనే చిక్కుకుపోవడంతో పోలీసులు అర గంట శ్రమించి వాజీద్‌ను బయటకు తీశారు. ఖేడ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతుండగా..

నర్సాపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ లింగం వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా దుండిగల్ గ్రామానికి చెందిన గడ్డమీద మహేష్(33) మంగళవారం నర్సాపూర్ మండలం రెడ్డిపల్లిలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి రెడ్డిపల్లి సమీపంలోని జాతీయ రహదారి క్రాస్ రోడ్డుపై రోడ్డు దాటుతుండగా నర్సాపూర్ నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య శృతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నర్సాపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నర్సాపూర్ మండలం చిన్నచింతకుంటకు చెందిన బండ పోచయ్య(50) భార్య చనిపోగా.. గ్రామానికి చెందిన మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. కుటుంబీకులతో ఉన్న కలహాలతో మనస్తాపం చెంది మంగళవారం రాత్రి 11 గంటలకు పురుగుల మందు తాగి అరుస్తుండగా కుటుంబీకులు నర్సాపూర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి సంగారెడ్డి ఆస్పత్రికి తరలించగా.. బుధవారం మృతిచెందినట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

రేకుల షెడ్డు పైనుంచి పడి వ్యక్తి మృతి

సంగారెడ్డి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన నితీష్‌కుమార్(28) కొంతకాలంగా సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుదేరా చౌరస్తాలో గల పెట్రోల్ బంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. బంక్‌కు సంబంధించి చౌరస్తాలో సిమెంట్ రేకుల షెడ్డు ఉన్నది. రేకులు పగిలిపోవడంతో పరిశీలించేందుకు పైకి ఎక్కి జారిపడడంతో తలకు గాయమైంది. సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. బుధవారం మృతిచెందాడు. తండ్రి చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపారు.

గేట్ ఫలితాల్లో మాచాపూర్ యువకుడి సత్తా



చిన్నకోడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్-2025) ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. ఇందులో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మాచాపూర్‌కు చెందిన సింగిరెడ్డి నిర్మలాఆదిరెడ్డి దంపతుల కుమారుడు శ్రావణ్‌రెడ్డి సత్తా చాటారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో ఆల్ ఇండియా స్థాయిలో 807వ ర్యాంక్ సాధించాడు. శ్రావణ్ రెడ్డి చిన్ననాటి నుంచి ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివినట్లు గ్రామస్థులు తెలిపారు. శ్రావణ్ రెడ్డిని పలువురు అభినందించారు.

ప్లానింగ్‌తో పరీక్ష రాద్దాం

టెన్త్ పరీక్షల కోసం నిపుణుల సలహాలు

సిద్దిపేట కల్చరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రేపటి నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలోనే పరీక్షలు ఏలా రాయాలి. ఏం చేస్తే మంచి మార్కులు స్కోర్ చేయవచ్చనే అంశాల గురించి విద్యా నిపుణులు నవీన్‌కుమార్, చేతిరాత నిపుణులు ఎజాజ్ అహ్మద్ సలహాలు, సూచనలు



జి. నవీన్ కుమార్, ఎడ్యుకేషన్ సైకాలజిస్టు



ఎజాజ్ అహ్మద్ చేతి రాత నిపుణులు

ఆత్మవిశ్వాసంతో రాసేద్దాం

- ఏడాది పొడువునా చదివారు. పరీక్ష హాల్లోకి ప్రవేశించే సమయంలో భయాన్ని వీడి కచ్చితంగా మంచి మార్కులు సాధించగలననే ఆత్మవిశ్వాసంతో వెళ్లాలి.
- పరీక్ష హాల్లో ఇన్విజిలేటర్ ఇచ్చే సూచనలను అర్థం చేసుకుని పాటించాలి. అర్థం కాకపోతే అడగాలి.
- ప్రశ్నాపత్రం పూర్తిగా చదివి అర్థం చేసుకున్నాకే సమాధానాలు రాయడం ప్రారంభించాలి. సమయం గురించి దిగులు చెందాల్సిన పనిలేదు.
- సమాధానాల కోసం ఇచ్చే బుక్‌లెట్‌లో ప్రతిపేజీకి ఎడమ వైపు రెండు సెంటీమీటర్ల మేర మార్జిన్ వదలాలి. అందులోనే ప్రశ్న సంఖ్య రాయాలి.
- ప్రశ్నాపత్రంలో బాగా వచ్చిన ఏ ప్రశ్నకైనా జవాబు రాయవచ్చు. ప్రశ్నల క్రమంతో సంబంధం లేదు. తెలిసిన ప్రశ్నలు రాసిన తర్వాతే, తెలియని ప్రశ్నలను ప్రయత్నించాలి.
- జవాబులను వీలైనంతవరకు పాయింట్స్ రూపంలో రాయటం మంచిది. ఎక్కువ మార్కులు పొందటానికి వీలుంటుంది. పాయింట్స్ సంఖ్యను మాత్రం మార్జిన్‌కు లోపలనే వేయాలి.
- ఒక ప్రశ్నకు జవాబు రాసిన తర్వాత మరో ప్రశ్నకు జవాబు రాసే మధ్యలో గీత కొట్టడం మంచిది.
- తప్పనిసరిగా రాయాల్సిన ప్రశ్నలు పూర్తయ్యాక అదనపు అదనపు (ఛాయిస్) ప్రశ్నలు రాయాలి. అలా రాసేటప్పుడు ఎక్స్‌ట్రా అని రాయకూడదు.
- బిట్ పేపర్, గ్రాఫ్‌పేపర్‌ను దారంతో కట్టడం మరిచిపోకూడదు.

అందంగా రాయాలి..

- సమాధానాలు రాసే సమయంలో చేతిరాత ఎంత అందంగా రాస్తే అంతా మంచి మార్కులు స్కోర్ చేసే అవకాశం ఉంటుంది.
- అక్షర దోషాలు, రాతలో గజిబిజి, కొట్టివేతలు ఉండకూడదు.
- సమాధాన పత్రంలో సమాధానాలు రాసేటప్పుడు ఎరుపు, పచ్చ ఇంకు పెన్నులు వాడరాదు. శీర్షికలను స్కెచ్ పెన్నులతో రాయవచ్చు. ఒక ప్రశ్నకు సమాధానం పూర్తయ్యాక పెన్సిల్‌తో గీత గీయవచ్చు. లేదంటే ఒక లైను వదిలి పెడితే సరిపోతుంది.
- పరీక్ష ప్రారంభంలో నెమ్మదిగా చివరి నిమిషాల్లో వేగంగా రాసి పరీక్షను ముగించవద్దు. ప్రశ్నపత్రంలో ఇచ్చిన ప్రశ్నల సంఖ్యకు రాసే సమాధానాల నిడివి ఆధారంగా సమయాన్ని విభజించుకుని సమాధానాలు రాయాలి.



- తెలుగులో అక్షరాలు సమానంగా గుండ్రంగా ఉండాలి. అచ్చుల గుర్తులు అన్నిచోట్ల సమానంగా ఉండాలి. తలకట్టు ఓకే ఆకారంలో అక్షరానికి సరిపోయే విధంగా ఇవ్వాలి. సున్నాలను అక్షరం సైజులోనే రాయాలి. ఒత్తులు చిన్నవిగా ఇవ్వాలి. వాక్యంలో పదాలకు మధ్య సరైన నిడివి ఉండాలి.
- ఫుల్ స్టాప్(చుక్క గుర్తు), కామా, బ్రాకెట్లు, ఆశ్చర్యార్థకాలు, ఇన్వర్టర్ కామాలు అవసరమైన చోట తప్పక రాయాలి.
- హిందీ సమాధానాలు రాసేటప్పుడు అక్షరాలు గుండ్రటి ఆకృతిని కలిగి ఉండాలి. నిలువుగీత కలిగిన అక్షరాలను సమానంగా ఒకే ఆకారం(సైజు)లో రాయాలి. ఎడమ వైపు గాని, కుడి వైపు గాని వంగినట్లు అక్షరాలను రాయవద్దు. పదాలు, లైన్లకు మధ్య విడివిలో సమానత్వం పాటించాలి.
- ఏ కీ మాత్ర(అచ్చుల గుర్తులు), ఐ కీ మాత్ర, ఔ కీ మాత్రలను మాత్రం ఎడమవైపు వాల్చుతూ సమానంగా రాయాలి. ఇ కీ మాత్ర, ఈ కీ మాత్ర అక్షరానికి గుడిష మాదిరిగా, అదే ఈ క్రమంలో కుడి వైపు వాలినట్లు రాయాలి.
- ఆంగ్లంలో ఏ, సీ, ఈ, ఐ, ఎం, ఎన్, ఓ, ఆర్, ఎస్, యూ, వీ, డబ్ల్యూ, ఎక్స్ అక్షరాలు మధ్య భాగాన వచ్చేటట్లు రాయాలి. బీ, డీ, ఎఫ్, హెచ్, కే, ఎల్, టీ అక్షరాలు పైకి వెళ్లేలా రాయాలి. జీ, జే, పీ, క్యూ, వై, జడ్ అక్షరాలు కిందకు వచ్చేటట్లు రాయాలి. కర్సివ్ రైటింగ్ గాని, లూసిడా రైటింగ్ గానీ ఏదైనా రాయవచ్చు. అక్షరాలు వాలేటట్లు రాయగూడదు. క్యాపిటల్ లెటర్స్ (పెద్ద అక్షరాలు) పెద్ద సైజులో, స్మాల్ లెటర్స్ (చిన్న అక్షరాలు) చిన్న సైజులో రాయకూడదు.
- గణితంలో అంకెలు చక్కగా రాయగలగాలి. సున్న అంకె 0ను ం లా రాయవద్దు. సున్న అంకె0ను రాయడం బాగా ప్రాక్టీస్ చేయాలి. సున్న, సమానత్వం, లెస్ దాన్(తక్కువ), గ్రేటర్ దాన్(ఎక్కువ), ప్లస్(కూడిక), మైనస్ (తీసివేత), మల్టిప్లికేషన్ లేదా ఇంటు (గుణకారం), డివిజన్ (భాగహారం) గుర్తులు స్పష్టంగా రాయాలి.
- సైన్స్‌లో భాగమైన ప్రయోగాల పటాలు, బొమ్మలు బాగా వేయాలి. పెన్సిల్‌తో పటాలను. బొమ్మలను గీసి భాగాలను గుర్తించి వాటి పేర్లను పెన్నుతో రాయవచ్చు. పటాలు బొమ్మల భాగాలను గుర్తించి కుడి వైపున రాయాలి.
- సాంఘిక శాస్త్రం తెలుగు అక్షరాలను రాసేటప్పుడు పాటించే నియమాలు, ఆంగ్ల మాధ్యమంలో సమాధానాలు రాసేవారు ఆంగ్ల నియమాలు పాటిస్తూ సమాధానాలు రాయాలి.

వీటన్నంటితో పాటు ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాస్తే విజయం మీదే..

నాచగిరి లక్ష్మీనృసింహ్మస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వర్గల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచగిరి లక్ష్మీనృసింహ్మస్వామి క్షేత్రంలో స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమైనాయి. శ్రీ క్షేత్రం పీఠాధిపతులు మధుసూదనానంద సరస్వతీ స్వామిజీ ఆలయ మండపంలో స్వామివారి వద్ద జ్యోతిప్రజ్వలన చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామిజీ మాట్లాడుతూ నాచగిరి లక్ష్మీనృసింహుడి కృప కటాక్షాలచే ప్రజలందరు సంతోషంగా ఉండాలన్నారు. వేడుకల సందర్భంగా ఆలయంలో ఆలయ వేద పండితులు కృష్ణమాచార్యులు, గోపాలకృష్ణశర్మ, నాగరాజ శర్మ, హరి ప్రసాద్ శర్మ, జగన్నాధ శర్మల వేద మంత్రోశ్ఛరణల మధ్యన ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కారనిర్వహణాధికారి విశ్వనాథ శర్మ, ఆలయ అధికారులు సుధాకర్‌గౌడ్, నరేందర్, పాండు, మండల ఎంపీటీసీ ఫోరం మాజీ అధ్యక్షులు వెంకటేశ్‌గౌడ్‌తో పాటులతో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న మధుసూదనానంద సరస్వతీ స్వామిజీ



రాహుల్, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నీలం మధు

బీసీ, ఎస్సీ బిల్లులు చరిత్రాత్మకం

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నో సంవత్సరాలుగా నలుగుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా బీసీలకు రాజకీయ, ఉద్యోగ, విద్య, ఆర్థిక రంగాలలో రిజర్వేషన్ల పెంపు బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదింపజేయడం చారిత్రాత్మకమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడెట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం చిట్కుల్ ఎన్ఎంఆర్ క్యాంప్ కార్యాలయంలో టీపీసీసీ పిలుపు మేరకు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అగ్రనేతలు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి అయన క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ లోక్‌సభ విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తుందన్నారు. మరోవైపు ఎస్సీ వర్గీకరణ పోరాటాన్ని ఆ వర్గ ప్రజల ఆకాంక్షలను గౌరవించి ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసి ఎన్నో ఏండ్ల కలను సాకారం చేశారని కొనియాడారు.

ఐదు రోజుల్లో అన్నాతమ్ముళ్లు మృతి

హుస్నాబాద్‌రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల వ్యవధిలో ఇద్దరు అన్నాతమ్ముళ్లు అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన పొన్నాల ప్రభాకర్ (27)ఈనెల 14న జాండీస్(పసకలు)తో అనారోగ్యానికి గురై ఇంటి వద్ద మృతి చెందాడు. అతని సోదరుడు పొన్నాల రవి (33) జాండీస్‌కు గురి కావడంతో సిద్దిపేట ఆసుపత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో బుధవారం సాయంత్రం మృతి చెందాడు. పొన్నాల లింగయ్య-లచ్చవ్వల పెద్దకు మారుడైన రవి స్థానిక గ్రామ పంచాయతీలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తుండగా, ప్రభాకర్ హుస్నాబాద్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తు తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇద్దరూ ఒకే వ్యాధితో, ఐదు రోజుల వ్యవధిలో చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఇద్దరు అన్నాదమ్ములకు భార్య, ఒక్కో కూతురు ఉన్నారు.

రసమయి ఫామ్‌హౌస్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం

- బెజ్జంకి, గుండారంలో ఉద్రిక్తపరిస్థితి



బెజ్జంకిలో కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

బెజ్జంకి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఫాంహౌస్ ముట్టడికి కాంగ్రెస్ ఇచ్చిన పిలుపు ఉద్రిత్తంగా మారింది. రసమయి ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశాల్లో ఏల్‌వోసీ, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయంపై మాజీ ఎమ్మెల్యే బహిరంగ చర్చకు బెజ్జంకికి రావాలని కాంగ్రెస్ నాయకులు సవాల్ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఫామ్‌హౌస్ ముట్టడికి కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. దీంతో సిద్దిపేట జిల్లా బెజ్జంకి, గుండారం గ్రామంలో ఉద్రికత్త పరిస్థితి నెలకొంది. ఫామ్ హౌస్ ముట్టడికి వెళ్లేందుకు యత్నించిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడే అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. బెజ్జంకిలో భారీగా పోలీసులు మొహరించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బెజ్జంకి అంబేడ్కర్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహనికి పూలమాల వేసి నిరసన తెలిపారు. పదేళ్ల అధికారంలో ఉన్న రసమయి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం విస్మరించి, రూ. కోట్లు సంపాదించుకుని ఫాంహౌస్‌లు కట్టుకున్నాడని ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని ఓ గ్రామంలో బాధిత కుటుంబానికి ఎల్‌వోసీపై కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడరని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యేను బహిరంగ చర్చకు పిలిస్తే రాకపోవడం వల్లే ఫాంహౌస్ వద్దకు వెళ్తున్నామని అన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే దాడులకు దిగుతారా..

సీఎం రిలీఫ్ ఫండ్, ఏల్‌వోసీ చెక్కుల పంపిణీలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తన అనుచరులతో దాడులకు దిగడం సరైంది కాదని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. తన ఫాంహౌస్ ముట్టడికి కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించిన నేపథ్యంలో బాలకిషన్‌ను, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గృహ నిర్బందం చేశారు. ఈ సందర్భంగా ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్, ఏల్‌వోసీ చెక్కులను కాంగ్రెస్ నాయకులు కాజేశారని ఆధారాలతో నిరూపిస్తానని చెబితే అసహానానికి లోనైనా కవ్వంపల్లి అనుచరులు దాడికి యత్నించడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలపై కాంగ్రెస్ నాయకులు చర్చకు వస్తే తాను ఎక్కడకు రమ్మన్నా ఆధారాలతో వస్తానని ఈ సందర్భంగా రసమయి సవాల్ విసిరారు.

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

బడ్జెట్ అన్ని వర్గాలకు ప్రయోజనం



సంగారెడ్డి టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుంది. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ప్రాధాన్యతనిచ్చి ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. ప్రజలు నమ్మి కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టినందున ప్రజలకు జవాబు దారీగా ఉంటూ పాలన సాగిస్తున్నాం. గత ప్రభుత్వ పాలనలో చిద్రమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. మహిళా సమాఖ్యల ద్వారా ఆర్టీసి అద్దెకు 600 బస్సులు కేటాయింపుతో వారికి పెద్దపీట వేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ఒక్కటే.

- నిర్మలాజగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్

రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీ



సంగారెడ్డి అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీ తప్ప ఆరు గ్యారెంటీల ఊసేలేదు. కీలకమైన విద్య, వైద్య, వ్యవసాయ, సాగునీటి రంగాలకు కంటితుడుపుగా నిధులు కేటాయించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఆర్థిక సాయం ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో ప్రకటించలేదు. జిల్లాలో సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకానికి నిధులు ఇవ్వకపోవడం తీవ్ర అన్యాయం చేయడమే.

- గోదావరి అంజిరెడ్డి, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు

విద్యకు అరకొర నిధులు



సిద్దిపేట కల్చరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించారు. విద్యకు గత సంవత్సరం రూ. 21,292 కోట్లు కేటాయిస్తే, ఈ సారి 0.26 శాతం మాత్రమే నిధుల కేటాయింపు అధికంగా ఉంది. మొత్తం బడ్జెట్ రూ. 3,04,965 కోట్లలో విద్యకు రూ. 23,108 కోట్లు (7.57శాతం) నిధుల కేటాయింపు ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి ఏ మాత్రం సరిపోదన్నారు.

-జి. తిరుపతిరెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

ప్రజలను ముంచే బడ్జెట్



సంగారెడ్డి రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ ప్రజలను ముంచే బడ్జెట్‌లా ఉంది. రాష్ట్ర బడ్జెట్ నిరాశగా ఉంది. ఈ ప్రభుత్వం గేమ్ చేంజర్ కాదు. నేమ్ చేంజర్ మాత్రమే. బడ్జెట్‌లో మహిళలకు ఇస్తామన్న రూ. 2500 ఊసేలేదు. అందాల పోటీకి మాత్రం రూ.250 కోట్లు పెట్టారు. రైతులకు ఇచ్చిన హామీలకు రూ. 42 కోట్లు అవసరమవుతాయి, బడ్జెట్‌ను చూస్తే రైతులను మరోసారి మోసం చేయబోతున్నారని స్పష్టం అయింది. కేవలం రూ.36 వేల కోట్లతో అభివృద్ధి ఎలా సాధ్యమో చెప్పాలి.

- చింతా ప్రభాకర్, సంగారెడ్డి ఎమ్మెల్యే

పేదల సంక్షేమానికి పెద్దపీట



గజ్వేల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసింది. అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇచ్చారు. ఆరు గ్యారెంటీల అమలుకు నిధులు కేటాయించారు. యువత, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే యంగ్ ఇండియా, రెసిడెన్సియల్ పాఠశాలలకు రూ.2900 కోట్లను కేటాయించడం హర్షణీయం. అన్ని రంగాలకు నిధులు కేటాయించి సీఎం రేవంత్‌రెడ్డి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారు.

- నర్సారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గజ్వేల్

కాంగ్రెస్‌ది ప్రజాపాలన బడ్జెట్..



సిద్దిపేట టౌన్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ ప్రజాపాలన బడ్జెట్‌గా ఉంది. రైతులు, విద్య, గ్రామాల అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమం ఇలా అన్ని వర్గాల వారికి పెద్దపీట వేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంకెల్లో గారడీ చేయడమే తప్ప రాష్ట్ర ప్రజలకు ఒరిగింది ఏమీ లేదు. కేసీఆర్ చేసిన అప్పులను చెల్లిస్తూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలందరూ రుణపడి ఉండాలి.

-అత్తుఇమామ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు

మల్లన్నసాగర్ కాలువలో చనిపోయిన కోళ్లు

దుబ్బాక, మార్చి19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరేంగగడ్డ నుంచి పారే మల్లన్నసాగర్ 4ఎల్ కాలువలో చనిపోయిన కోళ్ల వ్యర్థాలను పారేస్తున్నారని ఆగ్రామ కార్యదర్శి రాములు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలువతో పాటు బహిరంగ ప్రదేశాలల్లో కూడా చనిపోయిన కోళ్లను పారేస్తున్నారనీ, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని అన్నారు. గ్రామ మధ్యలో కోళ్ల ఫారాలు ఉండగా, గతంలో నోటీసులు ఇచ్చామని తెలిపారు. దుబ్బాక పట్టణంలోని ఏదుల్ల చెరువులో కూడా చనిపోయిన కోళ్లను, కోళ్ల వ్యర్థాలను పారేస్తున్నారనీ దుబ్బాక గ్రామ రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తుంది.



వడ దెబ్బకు నాటు కోళ్ల మృతి

చిలప్‌చెడ్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వడదెబ్బకు నాటు కోళ్ల మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని అమృత ఫాంలో బుధవారం చోటు చేసుకుంది. ఫాం యజమాని శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనివాస్ నాటుకోళ్ల ఫాంతో జీవనోపాధి పొందుతున్నాడు. బుధవారం ఒకేసారిగా 30 కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో బాధితుడు స్థానిక వెటర్నరీ అధికారి వినోద్‌కు సమాచారం చేరవేశాడు. అక్కడి చేరుకుని పరిశీలించిన ఆయన వడ దెబ్బ, అజీర్ణం కారణంగా మృతి చెందినట్లు తెలిపారు.

చలవ పందిళ్లతో నీడ కల్పించండి: కలెక్టర్

పాపన్నపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వన దుర్గామాత దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తొద్దని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు బుధవారం ఏడుపాయల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని ఏడుపాయల్లో చలువ పందిళ్ల వేసి భక్తులకు నీడ కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆది, మంగళ, శుక్రవారాల్లో భక్తుల సంఖ్య అధికంగా ఉంటుందన్నారు. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతున్నందున రాజగోపురం నుంచి అమ్మవారి ఆలయం వరకు చలవ పందిళ్ల వేయాలని ఆదేశించారు. అదేవిధంగా నేలపై మ్యాట్లు వేసి నీళ్ల పోయాలని చెప్పారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో పరిస్థితులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చూశారు. ఆయన వెంట పావన్నపేట తహసీల్దార్ సతీష్, పూజారి శర్మ, తదితరులు పాల్గొన్నారు.



నీటి శుద్ధి యంత్రం పనితీరును అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

బీమా ఏజెంట్ల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా

- జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జీవితబీమా సంస్థల్లో పనిచేస్తున్న ఏజెంట్ల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఎంపీ సురేష్‌షెట్కార్ హామీఇచ్చారు. వివిధ సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ బుధవారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో అఖిల భారత బీమా ఏజెంట్ల ఐకాస ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఖేడ్ ప్రాంత ఏజెంట్ల కోరిక మేరకు ధర్నాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జీవిత బీమా సంస్థ ప్రపంచంలోనే మూడోస్థానంలో ఉండి దేశవ్యాప్తంగా 14 లక్షల మంది ఏజెంట్లుగా, 30 కోట్ల మంది పాలసీదారులుగా ఉన్నారన్నారు. పై సమస్యలను పార్లమెంట్‌లో పరిష్కరిస్తానని తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో జహీరాబాద్, ఖేడ్ డివిజన్ల ఏజెంట్లు విఠల్‌గౌడ్, మాధవరావు, వెంకటేశం, దుర్గయ్య, కాశీనాథ్, తుకారం, మోహన్‌సింగ్, రాంచందర్, కృష్ణారావు, సంగారెడ్డి, అశోక్ ఉన్నారు.



ఢిల్లీలో ఎంపీ సురేష్‌షెట్కార్‌తో బీమా ఏజెంట్లు

మెదక్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే

హవేళిఘణపూర్/మెదక్ అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మెదక్ నియోజకవర్గాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోనే ఏడుపాయలకు సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి, రూ.22 కోట్లతో జిల్లాను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సింధురేణుక, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరశురాంగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రోహిత్‌రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో నిర్మించిన మెదక్ ప్రెస్‌క్లబ్ భవనాని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నరేష్‌గౌడ్, ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రారంభించి మాట్లాడారు. ఎన్నో ఏళ్ల జర్నలిస్టు కల సాకారమైందన్నారు. జర్నలిస్టు సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కారిస్తానని హామీఇచ్చారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

- చివరిరోజు 627 మంది గైర్హాజరు

సంగారెడ్డి అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షలు ముగిశాయి. చివరిరోజు బుధవారం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 54 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. 18,616 మందికి 17,989 మంది హాజరుకాగా, 627 మంది గైర్హాజరయ్యారు. 96.63 హాజరు శాతం నమోదైందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు. కాగా ఫస్టియర్ పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంతో కేంద్రాల నుంచి బయటకు వచ్చారు. ఇలా ఉండగా చివరి రోజు సంగారెడ్డిలోని షాహీన్, శ్రీ అక్షయ జూనియర్ కళాశాల కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ పరిశీలించారు.



సంగారెడ్డిలోని ఓ పరీక్ష కేంద్రం నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న ఫస్టియర్ విద్యార్థులు

తూప్రాన్ తైబజార్ వేలం రూ.36.20 లక్షలు

తూప్రాన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి తైబజార్, పశువుల సంత నిర్వహణకు మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి, మేనేజర్ రఘువరన్ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. గతేదాది రూ.28.50 లక్షల ఆదాయంరాగా, బుధవారం నిర్వహించిన వేలం పాటల్లో రూ.36.20 లక్షల ఆదాయం సమకూరింది. తుమ్మల గణేశ్ రూ.36.10 లక్షలకు వేలం పాట పాడగా, మనుమురాళ్ల అమృత రూ.36.20 లక్షల పాట పాడి వేలంలో దక్కించుకున్నారు. పశువుల సంతకు వేలం నిర్వహించగా రూ.1.80 లక్షలకు పాట రావడంతో రద్దుచేసి తిరిగి 24న నిర్వహించడానికి నిర్ణయించినట్లు కమిషనర్ పేర్కొన్నారు.

చేగుంట తైబజార్ వేలం రూ.19.71 లక్షలు

చేగుంట మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చేగుంట తైబజార్ వేలంపాటను గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీవో ప్రశాంత్ సమక్షంలో వేలం నిర్వహించారు. చేగుంటకు చెందిన ఈసారం వెంకట్‌గౌడ్ రూ.19.71 లక్షలకు తైబజార్‌ను దక్కించుకున్నాడు. కాగా అగ్రిమెంట్ పత్రాలు అందజేశారు.

బ్రాహ్మణుల సంక్షేమం కోసం పాటుపడతా..

తూప్రాన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణుల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడతానని బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్‌శర్మ తెలిపారు. తూప్రాన్‌లో బ్రాహ్మణ సంఘం జిల్లా ఎన్నిక, ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరయ్యారు. బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా శలాక రాజేశ్వరశర్మ(తూప్రాన్) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ప్రధాన అధికారి సోమయాజుల రవీంద్రశర్మ, సహాయకులు డీజీ శ్రీనివాసశర్మ, శాస్త్ర మధుశ్రీశర్మలు ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా గిరిరాజు కాశీనాథ్‌శర్మ (మెదక్), కోశాధికారిగా గౌడిచర్ల హరికృష్ణశర్మ(నర్సాపూర్), ఉపాధ్యక్షులుగా గిరిధర్‌రావు, నాగరాజుశర్మ, మైత్రామశర్మ, మోహన్‌రావు, సహాయ కార్యదర్శులుగా ప్రవీణ్‌శర్మ, రమేశ్‌శర్మ, ప్రమోద్, వేణుగోపాలశర్మ ఎన్నికైనట్లు తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య

సంగారెడ్డి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోల్కంపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకున్నది. మునిపల్లి ఎస్‌ఐ రాజేష్‌నాయక్ వివరాల ప్రకారం.. సదాశివపేట మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన నడిమిదొడ్డి పాపయ్య(48) మునిపల్లి మండలం పోల్కంపల్లి గ్రామంలోని కూతురు వద్ద కొంతకాలంగా ఉంటున్నాడు. మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి కంకోల్ గ్రామ శివారులో గల తుమ్మ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మతిస్థిమితం లేని కారణంగానే ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి అల్లుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్‌నాయక్ తెలిపారు.

విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలి

- మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్

నర్సాపూర్/శివ్వంపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ఆకాంక్షించారు. బుధవారం మండలంలోని పెద్దచింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 21 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభంకానున్నాయని, విద్యార్థులు భయం లేకుండా రాయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లు, ప్యాడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే శివ్వంపేట మండల పరిధిలోని చండీ జడ్పీహెచ్‌ఎస్, గోమారం జడ్పీహెచ్‌ఎస్, ఎస్సీ కాలనీ, శివాలయం, చిన్నగొట్టిముక్కల పాఠశాలలను డీఈవో రాధాకిషన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుపై దృష్టిసారిస్తున్నాం: డీఎంహెచ్‌వో



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గాయత్రీదేవి

జోగిపేట రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు చేరువ చేయాలనే సంకల్పంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంపై దృష్టిసారిస్తున్నారని డీఎంహెచ్‌వో గాయత్రీదేవి అన్నారు. మంత్రి ఆదేశాలతో మండలంలోని నేరెడిగుంట గ్రామంలో తాత్కాలిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. త్వరలో రూ.2.45 కోట్లతో గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. నేరెడిగుంట గ్రామానికి 11 సబ్ సెంటర్లు వచ్చాయని, 25 గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

నాగల్‌గిద్ద పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ



మనూరు పోలీస్‌స్టేషన్‌లో లాకప్ గదిని పరిశీలిస్తున్న ఎస్పీ పంకజ్ పారితోష్

నాగల్‌గిద్ద/మనూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మనూరు పోలీస్‌స్టేషన్‌తో పాటు నాగల్‌గిద్ద పోలీస్ స్టేషన్లను ఎస్పీ పంకజ్ పారితోష్ బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్లలో పెండింగ్‌లో కేసుల వివరాలతో పాటు రికార్డులను, లాకప్ గదులను పరిశీలించి మాట్లాడారు. సరిహద్దుల్లో గల పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఖేడ్ ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక పోలీసు సిబ్బంది ఉన్నారు.

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గుమ్మడిదల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని శైవక్షేత్రాల్లో ఒకటిగా నిలిచిన గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా వీరభద్రుడు భద్రకాళి అమ్మవారికి చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి శశిధర్‌గుప్తా, ధర్మకర్తల మండలి సభ్యులు కలిసి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించి బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగేందర్‌గౌడ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు సద్ది విజయభాస్కర్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, భద్రప్ప, నాయకులు పాల్గొన్నారు.

రేవంత్, దామోదర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

వెనుకబడిన వర్గాల కోటా 29 నుంచి 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణను 1, 2, 3 కేటగిరీలకు విభజిస్తూ మంగళవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బిల్లు ఆమోదించడాన్ని స్వాగతిస్తూ కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరిపాయి. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బాణసంచా కాలుస్తూ, స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, (ఆంధ్రజ్యోతి)



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు



డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నారాయణఖేడ్‌లో రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొండాపూర్: మల్కాపూర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డికి క్షీరాభిషేకం చేస్తున్న ఆత్మకమిటీ, మార్కెట్‌కమిటీ చైర్మన్లు

న్యూస్ బాక్స్

'సంప్రదాయానికి పట్టం కట్టాలి'

ఐడీఏబొల్లారం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతున్న సమయంలోనే సంప్రదాయాలకు పట్టం కట్టే విధంగా విలువలు నేర్పించాల్సిన అవసరం ఉందని ఐడీఏబొల్లారం పురపాలక పాలక మండలి మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి అన్నారు. బుధవారం పబ్లిక్ స్కూల్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థులు విభిన్న వేషధారణలతో నృత్యాలు చేశారు. 25 ఏళ్లుగా సాధించిన ప్రగతిని కరస్పాండెంట్ ప్రభు వివరించారు.

చేతిరాతపై మెళకువలు

చేగుంట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండలం చందాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం చేతిరాత నిపుణుడు ఎజాజ్ అవగాహన కల్పించారు. ఈజీగా రాసే చేతిరాతపై మెళకువలను ఆయన విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయులు వీకిషన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

సంగారెడ్డి రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఈశ్వరాపురం (ఇస్మాయిల్‌ఖాన్‌పేట) గ్రామంలోని దుర్గా భవానీ మహాక్షేత్రం ఆలయ 24వ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ధర్మాధికారి రాధాకృష్ణమూర్తిశర్మ పర్యవేక్షణలో అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకులు రవికుమార్‌శర్మ, దత్తాత్రేయశర్మ నూతన వస్త్రాలు, పూల మాలలతో ముస్తాబు చేశారు.

అల్లాదుర్గం పీఆర్ డీఈఈగా ప్రభాకర్

అల్లాదుర్గం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ అల్లాదుర్గం డీఈఈగా ప్రభాకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. స్థానిక డీఈఈగా విధులు నిర్వహించిన శివప్రసాద్ దీర్ఘకాలిక సెలువుపై వెళ్లిపోవడంతో ఆయన స్థానంలో కామారెడ్డి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది.

ఉచిత కంటి పరీక్షలు

ఐడీఏబొల్లారం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం పట్టణం బేరాక చర్చి ప్రాంగణంలో బుధవారం ఆశ్రయం అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా కంటి నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ మాజీ ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి, నేత ప్రవీణ్‌రెడ్డిలు ప్రారంభించి మాట్లాడారు. నిరుపేదలకు అన్ని విభాగాల్లో ఉచిత వైద్యం అందించేందుకు శిబిరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జయరాజ్, రవి, శ్రీనివాస్, శేఖర్, వెంకటేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం వర్ధంతి

సంగారెడ్డి రూరల్/పుల్‌కల్: సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో మల్లు స్వరాజ్యం 3వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాల్గొన్నారు. చౌటకూర్ మండలం శివంపేట చార్మినార్ బీరు పరిశ్రమలో సీఐటీయూ ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం వర్ధంతి నిర్వహించారు.

ఓటర్ ఆధార్ అనుసంధానానికి సహకరించాలి



అఖిలపక్ష నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మహిపాల్

నర్సాపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతీ ఓటరు తన ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని, అందుకు ఆయా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో అఖిలపక్షం నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, ఆయా పార్టీల నాయకులు శేఖర్, సురేష్, హరీశ్, నాగరాజు, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు వేలం ఆదాయం రూ.4.97 లక్షలు

నారాయణఖేడ్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్‌లోని శ్రీరామాలయ భూములను 2025 ఏప్రిల్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు కౌలు కోసం బుధవారం ఆలయ ఆవరణలో నిర్వహించిన వేలం పాటల ద్వారా రూ.4.97 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి శివరుద్రప్ప తెలిపారు. సర్వే నంబరు 87లోని 27.16 ఎకరాలకుగాను జూజాల్‌పూర్‌కు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి రూ.3.90 లక్షలకు, సర్వే నంబరు 106లోని 5.23 ఎకరాలకుగాను ఖేడ్‌కు చెందిన పల్లె నారాయణ రూ.72 వేలకు, సర్వే నంబరు 90లోని 1.09 ఎకరాలకుగాను చాంద్‌ఖాన్‌పల్లికి చెందిన చాప్లా నర్సింలు రూ.35 వేలకు దక్కించుకున్నారని వివరించారు. ఈ వేలం పాటల్లో ఆలయ కమిటీ బాధ్యులు హన్మాండ్లు, వివేకానంద్, పాండు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ ఇసుక తయారు చేస్తే క్రిమినల్ కేసులు

కంది, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కృత్రిమ ఇసుక తయారు చేస్తే క్రిమినల్ కేసులు పెడతామని కంది తహసీల్దార్ విజయలక్ష్మి హెచ్చరించారు. కంది మండలంలోని ఆరుట్ల, చిద్రుప్ప, ఎర్దనూర్, బ్యాతోల్ శివార్లలో కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నారనే సమాచారంతో తహసీల్దార్ విజయలక్ష్మి రెవెన్యూ సిబ్బందిచే ఏకకాలంలో దాడులు నిర్వహించారు. బ్యాతోల్, చిద్రుప్ప గ్రామాల్లో మూడు ఇసుక ఫిల్టర్ల ధ్వంసం చేశారు. మట్టి కడిగి ఇసుకను తీసే ప్రక్రియలో వాడే పైపులను కాల్చివేయించారు. ఇసుకఫిల్టర్ల జాలీలను, స్టార్టర్లను, మోటార్ల సరంజామాను ముక్కలుగా కట్ చేయించి నక్కవాగులో పడేశారు. ఆమె వెంట ఆర్ఐ రంగయ్య ఉన్నారు.



ఇసుకఫిల్టర్లను ధ్వంసం చేయిస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి

'జీవో 59 నివాసాలు క్రమబద్ధీకరించాలి'

జిన్నారం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జీవో 59 కింద డబ్బులు చెల్లించిన వారి నివాసాలు క్రమబద్ధీకరించాలని బాధితులు కోరారు. బుధవారం తహసీల్దార్ భిక్షపతిని మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, పలువురు జీవో 59 బాధితులు కలిసి వినతిపత్రం అందజేశారు. 2016-21 వరకు మూడు పర్యాయాలు జీవో 59 కింద నివాసాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు చేసి నిర్దేశిత డబ్బులు కూడా చెల్లించినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో వంద, 50 శాతం డబ్బులను చెల్లించినా నివాసాల క్రమబద్ధీకరణ జరుగలేదని, తమకు న్యాయం చేయాలని కోరారు. కాగా ప్రభుత్వం నివాసాల క్రమబద్ధీకరణ అంశంపై ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ పేర్కొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు

జిన్నారం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండలంలో మట్టి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నాగలక్ష్మి, ఆర్ఐ జయప్రకాష్ తెలిపారు. ఈనెల 17న ఆంధ్రజ్యోతిలో 'తవ్వేయ్..అమ్మేయ్' అనే శీర్షికన వెలువడిన కథనానికి స్పందించిన ఎస్‌ఐ నాగలక్ష్మి, ఆర్ఐ జయప్రకాష్ స్పందించి మట్టి తవ్వకాలు జరుపుతున్న వావిలాల, రాళ్లకత్వ పరిధి ప్రాంతాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని వారు తెలిపారు.

'కార్మికుడిని తొలగిస్తే సహించం'

కంగ్టి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : చిత్తశుద్ధితో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుడు శివరాంను విధుల్లోంచి తొలగిస్తే సహించమని మండల పరిధిలోని దెగుల్‌వాడి గ్రామంలో ప్రజలు కార్మికులతో కలిసి బుధవారం ఆందోళన చేపట్టారు. వయస్సు పైబడిందనే సాకుతో చురుకుగా పనిచేసే కార్మికుడిని తొలగించడం పద్ధతి కాదన్నారు. ఈ విషయంపై ఆంధ్రజ్యోతి పంచాయతీ కార్యదర్శి సంతోష్‌ను ప్రశ్నించగా ఆధార్‌లో ఉన్న బయస్సును బట్టి ఉన్నతాధికారులే తొలగించారని తెలిపారు.

స్కూల్ డ్రెస్‌లు నాణ్యతతో కుట్టాలి: డీపీఎం

నారాయణఖేడ్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం తరపున పంపిణీ చేసే స్కూల్ డ్రెస్ నాణ్యతతో కుట్టాలని ఇందిరాక్రాంతి పథం డీపీఎం జయశ్రీరాజ్ సూచించారు. ఖేడ్‌లో నిర్వహిస్తున్న స్కూల్ డ్రెస్ కుట్టు శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. కుట్టును బాగా నేర్చుకొని గ్రామస్థాయిలో మహిళలకు సైతం కుట్టుపై శిక్షణ ఇస్తూ నాణ్యతగా కుట్టేలా చూడాలన్నారు. ఆమె వెంట ఐకేపీ ఏపీఎంలు వంశీకృష్ణ, సాయిలు, కుమార్, చంద్రశేఖర్, సీసీలు వెంకట్, సుందర్, ఉన్నారు.

ఇంటివద్దకే భద్రాచలం శ్రీరాముడి తలంబ్రాలు

సంగారెడ్డి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటివద్దకే భద్రాచలం శ్రీరాముడి తలంబ్రాలు తెప్పించేందుకు ఏర్పాట్లు చేశామని ఆర్టీసీ డిపో మేనేజర్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు. బుధవారం ఆయన డిపోలో మాట్లాడుతూ ఆసక్తిగల భక్తులు పట్టణంలోని ఆర్టీసీ డిఎలో గల కార్గోలాజిస్టిక్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఏజెంట్‌కు రూ.151 చెల్లించి బుక్ చేసుకోవాలన్నారు. ఈనెల 18 నుంచి ఏప్రిల్ 6వ తేదీవరకు బుక్ చేసుకోవచ్చన్నారు. భద్రాద్రిలో నిర్వహించిన శ్రీరాముడి కల్యాణం అనంతరం బుక్ చేసుకున్న భక్తుల ఇళ్ల వద్దకే తలంబ్రాలు పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9182021588 నెంబర్‌కు ఫోన్‌చేసి సంప్రదించాలని ఆయన కోరారు.

రూ. 50 లక్షలతో మే ఫేయర్ రోడ్డు

రామచంద్రాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న మై ఫేయిర్, ఇన్ఫోసిటీ రోడ్డుకు మోక్షం లభించింది. బుధవారం రూ.50లక్షలతో ఏర్పాటు చేస్తున్న రోడ్డు పనులను కమిషనర్ సంగారెడ్డి పరిశీలించి మాట్లాడారు. రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ, త్రిపుర విల్లాస్ సభ్యులు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తూప్రాన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన బొంతపల్లి కృష్ణ(32) బుధవారం ఆస్పత్రిలో చూపించుకునేందుకు స్కూటీపై తూప్రాన్‌కు వచ్చాడు. ఆస్పత్రిలో చూయించుకుని సాయంత్రం స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో తూప్రాన్ పట్టణ పరిధి కరీంగూడ చౌరస్తాకు సమీపంలో లింగారెడ్డిపేట బ్రిడ్జి వద్దకు వెళ్లగానే కుక్క అడ్డుగా వచ్చింది. కుక్కను తప్పించబోయి కిందపడి తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు బొంతపల్లి శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శివానందం తెలిపారు.